



ఎర్రాజీ జ్యోతి

ఒలింపిక్స్‌లో తెలుగు తేజం

100 మీటర్ల హర్డిల్స్‌లో ఎర్రాజీ జ్యోతి

- ఈ ఈవెంట్‌కు భారత్ నుంచి అర్హత సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా రికార్డు
- ఆగస్టు 7న రౌండ్-1 పోటీలు
- పతకంపై క్రీడా వర్గాల్లో కోటి ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 26:
ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన జ్యోతి వెలుగులు విరజిమ్మనుందా...అంతర్జాతీయ యవనికపై పసిడి పతకంతో మెరుపులీననుందా...క్రీడా వర్గాల్లో ప్రస్తుతం ఇదే చర్చ జరుగుతోంది. వంద మీటర్ల హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాయడాన్ని మంచినీళ్ల ప్రాయంలా చేసుకుని, పతకాలను కొల్లగొడుతున్న ఎర్రాజీ జ్యోతి ఒలింపిక్స్‌లోనూ అద్భుత ప్రతిభతో సత్తా చాటుతుందని, నగర ఖ్యాతిని విశ్వవీధిలో ఎగురవేస్తుందనే ఆశాభావంలో క్రీడా రంగం ఉంది.

పారిస్ ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ మెరుపు అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పాల్గొనడం విశాఖ క్రీడా రంగానికి గర్వ కారణంగా నిలిచింది. 100 మీ. హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాస్తున్న జ్యోతి విశ్వక్రీడల్లో పతకం వైపు పరుగు తీసేందుకు సన్నద్ధమవుతోంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో జిల్లాస్థాయి నుంచి ఆసియా క్రీడల వరకు తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి రేస్‌లో పతకం సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్న జ్యోతి ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్ రేస్ ఈవెంట్‌లో పరుగు తీయనున్న తొలి భారత్ మహిళా అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది. విశాఖ నుంచి నేరుగా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గానూ ప్రత్యేకతను సంతరించుకుంది.



పోర్టు స్కూల్ నుంచి పారిస్ వరకు

పోర్టు స్కూల్ గ్రౌండ్‌లో అథ్లెట్‌గా క్రీడా జీవితాన్ని ప్రారంభించిన జ్యోతి తాజాగా ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి చేరింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా సాధన కొనసాగించింది. జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి క్రీడా నిపుణులను ఆకట్టుకుంది. అక్కడి నుంచి గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శాప్ ఏర్పాటుచేసిన స్పోర్ట్సు ఎక్సలెన్సీ సెంటర్‌లో చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నది. రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అకాడమీకి ఎంపికైన ... మిగతా 6వ పేజీలో

టీడీఆర్‌ల జారీపై విచారణ

- పురపాలక శాఖా మంత్రి ప్రకటన
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- ఆ పార్టీ నేతలకు వందల కోట్ల రూపాయల విలువైన బాండ్లు
- జీవీఎంసీ అధికారుల సహకారం


విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీఆర్‌ల జారీ పేరిట జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో పలు పట్టణాలు, నగరాల్లో టీడీఆర్ బాండ్ల జారీ పేరిట ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించారన్న ఫిర్యాదులపై విచారణ జరపాలని నిర్ణయించింది. అసెంబ్లీలో గురువారం గాజువాక ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు టీడీఆర్‌ల జారీపై ప్రస్తావించడంతో మంత్రి నారాయణ స్పందించారు. విశాఖపట్నంతో పాటు తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో టీడీఆర్‌ల జారీపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గుతేలుస్తామన్నారు. నగరంలోని సిరిపురం జంక్షన్‌లోని సీబీసీఎన్‌సీ స్థలంలో కొంత భూమి భవిష్యత్తులో రోడ్డు విస్తరణలో పోతుందని రూ.65 కోట్లు టీడీఆర్‌ను మాజీ ఎంపీకి చెందిన సంస్థకు జీవీఎంసీ పాలకులు ... మిగతా 6వ పేజీలో

పంచ గ్రామాల సమస్య పరిష్కారం దిశగా...

భూ వివాదంపై దేవదాయ శాఖా మంత్రి ఆనం అధ్యక్షతన అమరావతిలో విస్తృతస్థాయి సమావేశం

- ఉమ్మడి జిల్లా కూటమి ఎమ్మెల్యేలు హాజరు
- నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు
- ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి భూములు
- ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశం
- న్యాయస్థానంలో అఫిడవిట్‌కు ఏర్పాట్లు

సింహచలం, జూలై 26: సింహచల దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ వివాదం పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి నగరంలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ... మిగతా 6వ పేజీలో



అమరావతిలో శుక్రవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు, కొణతాల, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల, బండారు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు

రూ.222.43 కోట్లతో పోర్టు ఆస్పత్రి అభివృద్ధి

- పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్పు
- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ లోక్‌సభలో శుక్రవారం ప్రకటించారు. కైలాసపురంలో 80 పడకలతో నడుస్తున్న పోర్టు ఆస్పత్రిని పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో 300 పడకల మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చనున్నట్టు వివరించారు. పోర్టు ఉద్యోగుల వైద్యం ఖర్చును తగ్గించడానికి ఈ ప్రతిపాదన చేశామన్నారు. అదొక్కటే కాకుండా వైద్య అనుబంధ రంగాల్లో పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఇది దోహదపడుతుందన్నారు.

కమిషనరేట్ ప్రక్షాళన?

ఆధారాలతో జాబితా సిద్ధం చేసిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

- తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై వేటు
- మరో 25 మందికిపైగా ఎస్ఐ, సీఐలను రేంజ్‌కు సరండర్ చేసే యోచన
- రేంజ్ నుంచి నగరానికి వచ్చేందుకు 28 మంది సీఐల ఆసక్తి
- వారి సర్వీసు వివరాలపై ఆరా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



నగర పోలీస్ కమిషనరేట్ ప్రక్షాళనపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. ఇప్పటికే అవినీతిపరుల జాబితాను సిద్ధం చేసుకున్న ఆయన...అందులో తీవ్రమైన ఆరోపణలు ఉన్న వారిపై సస్పెన్షన్ వేటు వేయాలని, మిగిలిన వారిని రేంజ్‌కు సరండర్ చేయాలని నిర్ణయించుకున్నట్టు పోలీస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని సమాచారం.

పోలీస్ అధికారులు/సిబ్బంది విశాఖ నగరంలో పోస్టింగ్ వచ్చిందంటే వేరొకచోటకు వెళ్లడానికి ఇష్టపడరు. అన్నిరకాల సదుపాయాలు ఉండడంతోపాటు మంచి ఆదాయం లభించడమే దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. అయితే ఇటీవల సాధారణ ఎన్నికల సమయంలో మూడేళ్లు దాటి ఒకేచోట పనిచేసిన వారిని బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో నగరంలో ఏళ్ల తరబడి తిష్ఠ వేసినవారంతా తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. అటువంటి వారంతా ఎన్నికల కోడ్ ముగియగానే తిరిగి నగరానికి వచ్చేయాలనుకున్నారు. ఇంతలో సీపీగా శంఖబ్రతబాగ్చిని ప్రభుత్వం నియమించడంతో ఆశావహుల్లో కొందరు కంగుతిన్నారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు గురికావాల్సి ఉంటుందనే భయంతో వెనకడుగు వేశారు. అందరూ ఊహించినట్టుగానే సీపీగా బాధ్యతలు చేపట్టిన శంఖబ్రతబాగ్చి అవినీతిపరుల పట్ల కొరడా ఝులిపించడం మొదలెట్టారు. ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజల సమస్యలతోపాటు పోలీస్ శాఖలో అవినీతి, అలసత్వంపై ఫిర్యాదు చేయవచ్చునని ప్రకటించారు. లారీ డ్రైవర్ నుంచి డబ్బులు తీసుకున్నట్టు గుర్తుతెలియని వ్యక్తి హెల్ప్‌లైన్ నంబర్‌కు వీడియో తీసి పంపించడంతో హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై కూడా ఇలాంటి ఫిర్యాదులు అందడంతో ఆయన్ను వీఆర్‌కు సరండర్ చేశారు. మరికొందరు పోలీసుల అవినీతిపైనా సీపీకి ఆధారాలతో ఫిర్యాదులు అందడంతో వారిపై కూడా చర్యలకు సిద్ధం అవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే శాసనసభ సమావేశాలు జరుగుతుండడంతో ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎందుర్కొంటున్న వారి జాబితాలో కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సంబంధించి పక్కా ఆధారాలు ఉన్నట్టయితే సస్పెన్షన్ వేటు వేయాలని సీపీ నిర్ణయించినట్టు తెలిసింది. ఆ జాబితాలో ఎవరెవరు ఉన్నారనే దానిపై ఇప్పుడు పోలీస్ శాఖలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అలాగే ఒక మాదిరి ఆరోపణలు ఉన్నవారిని, సమర్థంగా పనిచేయలేకపోతున్న వారిని రేంజ్‌కు సరండర్ చేయనున్నట్టు సమాచారం. ఈ జాబితాలో ఎస్‌ఐలు, సీఐలు కలిపి 25 మంది వరకూ తెలిసింది. ఇదిలావుండగా సస్పెన్షన్, ... మిగతా 6వ పేజీలో

కార్గిల్ అమరవీరులకు నివాళి



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం విక్టరీ ఎట్ సీ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా. - వార్త I పేజీలో

పని వేళల్లో మీటింగ్‌లు వద్దు

- తక్షణమే చెక్ పెట్టండి
- స్టీల్‌ప్లాంటు సీఎండీకి ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశం
- ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని ఆందోళన
- యు-పాస్‌లు రద్దు చేయాలని ఆదేశాలు
- ప్లాంటులో రిటైర్డ్ ఉద్యోగి మంత్రి రాజశేఖర్ సమావేశాలపై ఆరా

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో కార్మికుల పని గంటలు వృథా అవుతున్నాయని, తక్షణమే దీనికి చెక్ పెట్టాలని సీఎండీ అతుల్‌భట్‌ను కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించింది. నాలుగు రోజుల క్రితం దీనిపై ఓ లేఖ పంపి, వివరణ కోరింది. రిటైరైన మంత్రి రాజశేఖర్ రోజూ ప్లాంటుకు వస్తూ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు కార్మికులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని, అందులో 50 మంది వరకూ పాల్గొంటున్నారని, ప్లాంటు పనివేళల్లో డ్యూటీ వదిలేసి వారంతా మీటింగ్‌లకు వెళ్లడం ఉత్పత్తి తగ్గిపోతున్నదని, తక్షణమే దీనిపై వివరణ ఇవ్వాలని కోరింది. ఇకపై ఇలాంటివి కొనసాగడానికి వీల్లేదని స్పష్టంచేసింది. అలాగే కొంతమంది యూనియన్ నాయకులకు పర్సనల్ డిపార్టుమెంట్ 'యు-పాస్‌లు' జారీచేసిందని, వారంతా ఉదయం డ్యూటీకి వచ్చి హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారని, తిరిగి సాయంత్రం వచ్చి బయోమెట్రిక్ వేస్తున్నారని, వారు పనిచేయకపోయినా జీతాలు అందుతున్నాయని పేర్కొంది. సుమారు 120 మందికి ఇలాంటి పాస్‌లు ఇచ్చారని తెలిపింది. వాటిని కొందరు ఉద్యోగులకు విక్రయించుకుంటున్నారని, వాటి ద్వారా విధులకు హాజరు కాకుండా ... మిగతా 6వ పేజీలో

భూ రికార్డులకు భద్రత

- మదనపల్లె ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాలు
- కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు నిర్ణయం
- నైట్ వాచ్‌మన్ కూడా...
- విశాఖలోనూ గతంలో రికార్డులు దహనం చేసిన ఉదంతాలు



గాజువాక తహసీల్దారు కార్యాలయంలో సీసీ కెమెరా

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలువైన రెవెన్యూ రికార్డులు దగ్ధమైన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్, కలెక్టర్ కార్యాలయాలు, సర్వే విభాగంలో భూముల రికార్డుల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు ఇచ్చారు. ఆర్డీవో/తహసీల్దార్/సర్వే శాఖల పరిధిలో రికార్డులు భద్రపరిచే గదులు, కలెక్టరేట్‌లో రికార్డు రూమ్‌లో రికార్డుల రక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ప్రతిచోట సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.

జిల్లాలో కలెక్టరేట్, విశాఖ, భీమిలి ఆర్డీవో కార్యాలయాలు, 11 మండలాల్లో తహసీల్దార్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటికే కలెక్టరేట్, విశాఖ ఆర్డీవో, గాజువాక, విశాఖ రూరల్ మండల తహసీల్దారు కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు ... మిగతా 6వ పేజీలో

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

సమస్యలపై ఇప్పుడైనా దృష్టి సారించేనా?

- ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు
- అధ్వానంగా రహదారులు
- ఐదేళ్లుగా సాగునీటి వనరుల నిర్వహణ పనులు నిల్
- పాఠశాలల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- సాధారణ ఎన్నికల తరువాత మొదటి సమావేశం
- కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం



విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొట్టమొదటిసారిగా శనివారం జరగనున్నది. గత సమావేశం నాటికి ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇప్పుడు లేరు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లు, 13 ఎమ్మెల్యే సీట్లను కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) కైవసం చేసుకుంది. అరకు ఎంపీ స్థానంతో పాటు పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న జడ్పీ తొలి సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. జడ్పీలో వైసీపీకి మెజారిటీ ఉండగా, ఇద్దరు ఎంపీలు, పది మంది ఎమ్మెల్యేలు కూటమి ... మిగతా 6వ పేజీలో

హెల్మెట్ లేకుంటే రూ. వెయ్యి జరిమానా: డీటీసీ



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

మురళీనగర్, జూలై 26 ; ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకుంటే రూ. 1000 జరిమానా విధించనున్నట్టు విశాఖ ఆర్టీఏ కార్యాలయ డీటీసీ జి.సి.రాజారత్నం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన రహదారి భద్రతా సమావేశంలో సవరించిన కొత్త నిబంధనలు తెలియజేశారు. బీఐఎస్ నంబర్ కలిగిన హెల్మెట్‌ను ధరించి తీరాలని అన్నారు. 2020 నుంచి ఈ మేరకు భద్రతా కేంద్రం ద్వారా 94,327 మందికి అవగాహన కల్పించినట్టు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ ధరించకుంటే జరిమానాతో పాటు 3 నెలల పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

'ఎంఈఎస్ బిల్డర్స్ సమస్యలు పరిష్కరించాలి'



నేవీ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రమిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

మల్కాపురం, జూలై 26: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచి ప్రతినిధుల ఆధ్వర్యంలో నేవీ ప్రధాన ఇంజనీర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీరెడ్డి, టీవీఎస్ సుబ్బరాజు (చిరంజీవి) మాట్లాడుతూ ఎంఈఎస్‌లో వివిధ తరగతుల్లో రిజిస్టర్ అయిన కాం ట్రాక్టర్ల టెండర్ పరిమితి పెంచాలని కోరారు. వర్కింగ్ గ్రూప్ సిఫార్సు ప్రకారం చేపట్టిన పనులు ఆధారంగా భద్రత కల్పించేలా జీఈ జారీ చేసి 50శాతం నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ క్లాస్ కాంట్రాక్టర్లకు రూ. 25 లక్షల పైగా రూ.50 లక్షల వరకు టెండర్లను జారీ చేయాలని, అలాగే, 11 నెలలకు టెండర్ల సమయంలో లేబర్ చార్జీలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉండేలా చూడాలని కోరారు. ఈ మేరకు నేవీ ప్రధాన ఇంజనీరును కలిసి వినతి పత్రమిచ్చారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి. సూరిబాబు, ఎన్. రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ ఎ.అనంతరాజు, కోశాధికారి రామప్రసాద్ రెడ్డి, సభ్యులు సి. బాలసతీష్, యు.వి. రామకృష్ణరాజు, సీహెచ్ సుదర్శన్, సీహెచ్ మంగపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

సీతంపేట, జూలై 26: రామాటాకీస్ డౌన్ రోడ్డులో రహదారులను ఆక్రమించి చేపడుతున్న చిరువ్యాపారాలను ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరావు పర్యవేక్షణలో తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అటుగా లేకుండా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



రామాటాకీస్ డౌన్ రోడ్డులో వ్యాపారులను తొలగిస్తున్న పోలీసులు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రదానం రేపు

అక్కయ్యపాలెం, జూలై 26 : కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి విశ్వనాథ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28వ తేదీన ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ బహుమతుల ప్రదానోత్సవానికి పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆదారి శ్యాంప్రసాద్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు, ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ మళ్ల భాస్కర్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి లచ్చా అప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి కుమార స్వామి, వేగి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, పెంటకోట సంజీవరావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ అభివృద్ధికి చర్యలు

పూర్ణామార్కెట్, జూలై 26: పూర్ణామార్కెట్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలనే ఆలోచనలో జీవీఎంసీ జోనల్ అధికారులు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జీవీఎంసీ జాబితాలో ఉన్న దుకాణాల కంటే అధిక సంఖ్యలో మార్కెట్ లోపల వ్యాపారులున్నట్టు అధికారులు భావిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ అమలుతో ఈ అడ్డగోలు వ్యాపారాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. వైసీపీ అనుకూలురు ఆశీల వసూల కోసం అడ్డగోలుగా వ్యాపారాలు ఇబ్బడిముబ్బడిగా అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పూర్ణామార్కెట్‌లో పార్కింగ్ స్థలం ఆక్రమణలు, మాస్టర్ ప్లాన్ అమలుకు పరిస్థితిని అంచనా వేసేందుకు జోనల్ కమిషనర్ ప్రసాద్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం తనిఖీ చేపట్టింది.



గతుకుల మయంగా సెబాస్టియన్ కాలనీ రోడ్డు



అధ్వానంగా బాబుకాలనీకి వెళ్లే మార్గం

అధ్వాన రహదారులతో అవస్థలు

» జ్ఞానాపురంలోని పలు కాలనీల్లో దుస్థితి

జ్ఞానాపురం, జూలై 26: జీవీఎంసీ 41వార్డు పరిధిలోని జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. కాలనీలో ఏ రోడ్డు చూసినా గతుకులతో నిండి ఉంటోంది. కొన్నిచోట్ల రోడ్లు తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతోపాటు ప్రస్తుతం వర్షాలుపడుతుండంతో బురదమయంగా మారుతున్నాయి. 24 గంటల నీటి సరఫరాకు తవ్విన రోడ్లు పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. ఆయా రోడ్లపై అనేకమంది వాహనదారులు ప్రమాదాలు బారిన పడి గాయాలపాలవుతున్నారు. అలాగే, ఈ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో అంధకారం నెలకొంది.ఈస్థితిలో జోన్-5 ఇంజనీరింగ్ అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మునిసిపల్ పీడీ, పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడిగా సునంద్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 26 : ఏపీ మున్సిపల్ పీడీ, పీఈటీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎ. సునంద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను శుక్రవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎల్.రమణ, కోశాధికారిగా యూఎన్ రత్నం ఎన్నికయ్యారు. కేఎస్‌వీ సత్యనారాయణ (పైసా మాస్టారు) పర్యవేక్షణలో, రాష్ట్ర నాయకులు దాసరి సుధీర్, దోనేపూడి సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సత్కరించి అభినందించింది. జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సునంద్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీ ఎంసీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

టీడీపీ ఆత్మీయ సమావేశం



హనోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 26: గ్రేటర్ 45వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కంపా హనోక్ టీడీపీలో చేరిన సందర్భంగా మాజీ కార్పొరేటర్, టీడీపీ సీనియర్ నాయకుడు పైలా ముత్యాలనాయుడు, వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నరసింహనగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనోక్‌కు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం హనోక్ మాట్లాడుతూ,వార్డు అభివృద్ధికికృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి భాగస్వామినవుతానని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పలిశెట్టి అప్పన్న, కోట నరేష్, ఎస్కే బాబ్జీ, శెట్టి మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేటర్లతో టీడీపీ ఎమ్మెల్యేలు సమావేశం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు శనివారం పార్టీకి చెందిన కార్పొరేటర్లతో సమావేశం కానున్నారు. ఉదయం 10.30 గంటలకు దసపల్లా హోటల్‌లో ఈ సమావేశంలో టీడీపీ నుంచి గెలిచిన వారితోపాటు కొద్దిరోజుల కిందట వైసీపీ నుంచి పార్టీలో చేరిన కార్పొరేటర్లు కూడా ఈ పాల్గొననున్నారు. త్వరలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో ఆయా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంతో పాటు ఇతర అంశాలపైనా చర్చించనున్నారు. అలాగే, స్థానిక ఇబ్బందులతో కొంత మంది వైసీపీకి చెందిన కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోలేదు. దీనిపైనా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముందని చెబుతున్నారు.

ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 26: ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ వి శాఖ అర్బన్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ముందుగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్నికల అధికారి) గంట్ల శ్రీను బాబు నామినేషన్లు స్వీకరించారు. వాటిని పరిశీలించిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఇరోతి ఈశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పి.నరసింగరావు, కార్యదర్శిగా కె. మధన్, ఉపాధ్యక్షులుగా అనురాధ, నాయుడు, బాబూరావు ఎంపియ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.భాస్కర్, మళ్ల దేవత్రినాద్, నాయుడు, కోశాధికారిగా ఎ.సు రేష్, జాయింట్ సెక్రటరీలుగాఎ.శేషు, కోరాడ శశిభూషణరావు తదితరులు ఎంపిక చేశారు.

సెల్‌ఫోన్ టెక్నీషియన్స్‌ను ప్రభుత్వాలు ఆదుకోవాలి

» వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

సీతంపేట, జూలై 26: విశాఖలోని సెల్‌ఫోన్ టెక్నీషియన్స్ అంతా ఏకతాటిపై నిలిచి సమస్యలు పరిష్కరించుకోవాలని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సెల్‌ఫోన్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్స్ భవిష్యత్తు కార్యాచరణ, ఎదుర్కొంటున్న సమస్యలపై సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ సెల్‌ఫోను టెక్నీషియన్స్‌ని కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యవజన పథకం ద్వారా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా తమకు ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటి వరకు విశాఖలో 250 మంది సభ్యత్వం ఉందన్నారు. వీరికి సొసైటీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, రాము, రాజేష్, అహ్మద్, రాజేష్, ఇమ్రాన్, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 128 మంది ఎంపిక

కంచరపాలెం, జూలై 26: కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాంతాల నుంచి 385 మంది హాజరుకాగా, వీరిలో 128 మందిని ప్రాథమికంగా ఎంపికచేశారు. వీరికి ఉపాధికల్పనాధికారులు సీఈహెచ్. సుబ్బిరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ప్రాంతీయ ఉపాధికల్పనాధికారి సంగీత యువతకు పలు సూచనలు చేశారు.



అభ్యర్థికి నియామకపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

భూ రికార్డులకు భద్రత

... 5వ పేజీ తరువాయి

చేయాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు. అలాగే ప్రతి కార్యాలయంలో నైట్ వాచ్‌మన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వీఆర్ఏలకు డ్యూటీలు వేయాలని నిర్ణయించారు. ఏడెనిమిదేళ్ల క్రితంభీమిలి, విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రికార్డులు మార్చిన కొందరు అధికారులు, సిబ్బంది...ఆ విషయం ఎక్కడ బయటపడుతుందోనని నిప్పు పెట్టి, అగ్ని ప్రమాదం సంభవించిందని ప్రచారం చేసినట్టు అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం నగరంలో ఒక ప్రముఖుడి ప్రోద్బలంతో అర్బన్ ల్యాండ్ సీలింగ్ రికార్డులకు నిప్పు పెట్టేశారు. మదనపల్లె తరహా ఘటనలు గతంలో ఇక్కడ చోటుచేసుకున్న నేపథ్యంలో రికార్డులు సురక్షితంగా ఉండేందుకు కలెక్టరేట్‌తోపాటు, ఆర్డీవో కార్యాలయం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దారు కార్యాలయాల్లో కాంపాక్టర్లు (బీరువా మాదిరిగా) ఏర్పాటుకు నిర్ణయించారు.విశాఖ ఆర్డీవో కార్యాలయంలో భూమి రికార్డుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందని, తన పరిధిలో మండల తహసీల్దారు కార్యాలయాల్లో భద్రతా చర్యలుతీసుకోవాలని ఆదేశించామన్నారు.

టీడీఆర్‌ల జారీపై విచారణ

... 5వ పేజీ తరువాయి

జారీచేశారు. అలాగే ఐక్కన్నపాలెంలో పదిహేనేళ్ల కిందట నిర్మించిన రోడ్డులో రెండెకరాలు పోయిందంటూ ఒక వ్యక్తి దరఖాస్తు చేయగా...రూ.208 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేశారు. ఇవికాకుండా వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో నగరంలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలను వెలుగులోకి తేవాలని టీడీపీ ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రస్తావించగా మునిసిపల్ మంత్రి నారాయణ స్పందించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం రాత్రి పల్లా శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖలో టీడీఆర్ కుంభకోణం మొత్తం బయటకు తీస్తామన్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకునేలా విచారణకు ప్రభుత్వం ఆదేశాలు ఇస్తోందని ఆశాభావం వ్యక్తంచేశారు.

బయోలాజికల్ సైన్స్‌పై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

జ్ఞానాపురం, జూలై 26: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయోలాజికల్ సైన్స్‌లో పురోగతిపై జాతీయ సదస్సును శుక్రవారం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా మైసూర్ సీఎస్ఐఆర్ - సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హరీష్ ప్రశాంత్ హాజరయ్యారు. విద్యార్థులకు కెరీర్ ఇన్ సైంటిఫిక్ రీసెర్చ్, సవాళ్లు అనే అంశాలను వివరించారు. తొలి రోజు సదస్సులో ఏయూ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సుభాషిణీదేవి సిల్వర్ నానో పార్టికల్స్ క్షేత్ర పరిధి పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ పి.మేరీ అనుపమ, హోంసైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ ప్రభ, సుధ, పీకే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



రైల్వే న్యూ కాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 26 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కేఎస్ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మలేరియా, డెంగ్యూ వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొర మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు సోకవన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు హరినాథ్, సత్యనారాయణ, మలేరియా సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరుల త్యాగం మరువలేం



కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ సైనిక బ్యాంక్ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 26: పాకిస్థాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని, వారి త్యాగం మరువలేమని మాజీ సైనిక బ్యాంక్ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి సురేష్ అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమర వీరులకు నివాళులర్పిస్తూ మాజీ సైనిక ఉద్యోగులు బీచ్‌రోడ్డులో శుక్రవారం ఆల్ ఇండియా ఎక్స్ సర్వీస్ మేన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అమరవీరుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. కాళీ మాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ఈ ర్యాలీ సాగింది. మాట్లాడుతూ 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

నేటి నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

కంచరపాలెం,జూలై 26 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను శనివారం నుంచి నిర్వహించనునట్టు జిల్లా ఐటీఐల కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న స్టీల్‌ప్లాంట్ భూ బాధితులు, బాలికలు, మాజీ సైనికుల పిల్లలు, ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్స్ చెందిన విద్యార్థులు, దివ్యాంగులు తదితర కేటగిరీలకు చెందిన వారు (మొదటి ర్యాంకు నుంచి 875 ర్యాంకు వరకు), జీపీఏ 10 నుంచి 6.4 అభ్యర్థులు శనివారం ఉదయం 8 గంటలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఆదివారం 876 ర్యాంకు నుంచి 2067 ర్యాంకు వరకు (జీపీఏ 6.3, అంతకంటే తక్కువ) వారికి కౌన్సెలింగ్ ఉంటుంది. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్, కుల తదితర ధ్రువ పత్రాలు తప్పకుండా తమ వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వ్యాను బోల్తా.. ఒకరి మృతి

దత్తిరాజేరు, జూలై 26: విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని మరడాం, కోమటిపల్లి మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం బొలేరో వ్యాను బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటనపై స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామభద్రపురం నుంచి విశాఖ వెళ్తున్న బొలేరో వ్యాను మరడాం, కోమటిపల్లి మధ్యలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విశాఖపట్టణం జిల్లా మారికవలసకు చెందిన లోగడ పైడినాయుడు(35), శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని పీహెచ్‌సీకి తరలించగా.. పైడినాయుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు.

ఒలింపిక్స్‌లో తెలుగు తేజం

... 5వ పేజీ తరువాయి

తర్వాత జ్యోతి పరుగు ప్రస్థానంలో చోటుచేసుకున్న మార్పులు ఆమె దశ, దిశను నిర్దేశించాయి. అనతికాలంలోనే 100 మీ. హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగి పతకమే లక్ష్యంగా ఆమె తీసిన పరుగుకు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. అంతర్జాతీయ ట్రాక్అండ్‌ఫీల్డ్‌లో ఆసియా క్రీడల వరకు ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించి అత్యున్నత అథ్లెట్లలో ఒకరిగా ఎదిగి ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరింది.

ఆగస్టు 7న రౌండ్-1 పోటీల్లో

ఆగస్టు 7న మహిళల 100 మీ. హర్డిల్స్‌లో రౌండ్-1 (హీట్స్) పోటీల్లో జ్యోతి పాల్గొననుంది. ఆగస్టు 8న జరిగే రిపిచేజ్ రేస్ (హీట్స్‌లో క్వాలిఫై కానివారిలో బెస్ట్ టైమింగ్ ఉన్న అథ్లెట్లకు మరో అవకాశంగా నిర్వహించేది) ఉంటుంది. ఆగస్టు 9న సెమీఫైనల్, 10న ఫైనల్ రేస్ జరగనుంది.

కమిషనరేట్ ప్రక్షాళన?

... 5వ పేజీ తరువాయి

రేంజ్‌కు సరండర్ కారణంగా ఖాళీ అయ్యే పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన ఇతర జిల్లాల్లోని ఎస్ఐ, సీఐల నుంచి సీపీ విజ్ఞాపనలు తీసుకుంటున్నారు. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న సీఐల్లో 28 మంది నగరానికి వచ్చేందుకు సంసిద్ధత తెలియజేస్తూ సీపీకి ప్రత్యక్షంగా, వాట్సాప్‌లోనూ దరఖాస్తులు అందజేసినట్టు సమాచారం. నగరానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నవారి సర్వీసు వివరాలతోపాటు గతంలో సస్పెన్షన్లు, చార్జిమెమోలు అందుకోవడం, వారి సమర్థతను తెలుసుకుని తనకు నివేదిక అందజేయాలంటూ సీపీ ఇప్పటికే కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. సమర్థులు, నిజాయితీగా పనిచేస్తారనే గుర్తింపు కలిగిన వారిని మాత్రమే నగరానికి తీసుకోవాలని సీపీ భావిస్తున్నట్టు సమాచారం. వీరితోపాటు నగరానికి రావడానికి ఆసక్తి చూపనివారిలో సమర్థులుగా గుర్తింపు కలిగిన వారితో సీపీ మరో జాబితా తయారుచేసుకున్నట్టు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. శాసనసభ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. కాబట్టి తర్వాత ఏ క్షణంలోనైనా అవినీతిపరులపై సీపీ చర్యలకు దిగే వీలుందని పోలీస్ కమిషనరేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పంచ గ్రామాల సమస్య పరిష్కారం దిశగా...

... 5వ పేజీ తరువాయి

లక్షలాది మందికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం నడుంబిగించింది.

పంచ గ్రామాల భూ సమస్యపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని సమావేశ మందిరంలో దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశం ఏర్పాటుచేసి, సమగ్రంగా చర్చించారు. ఆ వివరాలను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర హైకోర్టులో 2019లో దాఖలైన వ్యాజ్యానికి లోబడి జీవో 229లో పేర్కొన్న రేట్ల ప్రకారం 12,149 నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులపై నివేదిక సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమబద్ధీకరణ వల్ల సింహాచలం దేవస్థానానికి కలిగే నష్టాన్ని భర్తీ చేయనున్నారు. సుమారు 421 ఎకరాలకు సమాన విలువ ఉండే విధంగా ప్రాథమికంగా గుర్తించిన 853.6 ఎకరాల బదలాయింపుతో పాటు అవసరాల నిమిత్తం రహదారికి అనుసంధానంగా ఉన్న మరికొంత భూమిని గుర్తించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సత్వరం సమర్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్‌ను మంత్రి రామనారాయణరెడ్డి ఆదేశించారు. దాని ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతితో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి కోర్టు నుంచి ఉత్తర్వులు పొంది కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు చేపడతామని సమావేశంలో మంత్రి వెల్లడించారు. అదేవిధంగా పంచ గ్రామాల భూవివాదంలో అంతర్భాగమైన రైతుల సమస్యకు సంబంధించి 1,947 ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన అప్పీళ్ల విషయంలో కూడా పరిష్కారం కనుగొనేందుకు త్వరలో విశాఖ జిల్లా కలెక్టర్ సారథ్యంలో మరొక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పీవీజీఆర్ నాయుడు (గణబాబు), వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కోడూరి అచ్యుత రామచంద్రమోహన్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పని వేళల్లో మీటింగ్‌లు వద్దు

... 5వ పేజీ తరువాయి

తప్పించుకుంటున్నారని పేర్కొంది. వీరి వల్ల ప్లాంటులో ఉత్పత్తి తగ్గిపోతున్నదని ఆరోపించింది. ఎక్కడా లేనివి పాటిస్తూ ప్లాంటుకు నష్టం కలిగిస్తున్నారని, తక్షణమే వీటిని నిలుపుచేసి కార్మికులు, ఉద్యోగుల డ్యూటీ సమయంలో ప్లాంటు దాటి బయటకు వెళ్లకుండా, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని ఉక్కు మంత్రిత్వ శాఖ కోరింది. ఈ ఉత్తర్వులపై కార్మిక సంఘాల్లో తర్జనభర్జన మొదలైంది. అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారా?...అని అంతా ఎదురు చూస్తున్నారు. ఇటీవల పర్సనల్ డైరెక్టర్ తన పదవికి రాజీనామా చేయడానికి ఇవి కూడా కొంత కారణమని ప్లాంటు వర్గాలు చెబుతున్నాయి.

సమస్యలపై ఇప్పుడైనా దృష్టిసారించేనా?

... 5వ పేజీ తరువాయి

తరపున ఉన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో ఏ సమస్యనూ పట్టించుకోలేదు. ప్రధానంగా రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మరో మూడు నెలల పాటు వర్షాకాలం కొనసాగనున్నందున రోడ్ల మరమ్మతులకు తక్షణం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ జడ్పీ సమావేశం తీర్మానం చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్లగా కాలువలు, జలాశయాలు, గ్రోయిన్ల మరమ్మతులు ఊసే లేదు. చివరకు డ్యామ్‌ల నిర్వహణకు నిధులు లేవు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పెద్దగా చొరవ చూపలేదు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు సజావుగా సాగాలంటే జలాశయాలకు సంబంధించిన కాల్వల్లో పూడికలు తీయడం, చిన్నపాటి మరమ్మతులు చేయడం పైనైనా దృష్టిసారించాలి. అలాగే వర్షాకాలం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలో మైదానం ప్రధానంగా ఏజెన్సీలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతంతోపాటు పట్టణాల్లో వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకోవాలి. కాగా 'నాడు-నేడు' పేరుతో రెండు దశల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం గడచిన ఏడాది నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అనేకచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటి పూర్తికి నిధులు తెచ్చుకోవలసి ఉంది. వర్షాలతో ఏజెన్సీలో పాఠశాలల భవనాలు దెబ్బతినడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టిన జల జీవన్ మిషన్ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగింది. వీటితో పాటు జిల్లాలో నెలకొని ఉన్న పలు సమస్యలపై జడ్పీ సమావేశంలో సభ్యులు చర్చించే అవకాశం ఉంది.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు


అలంకరణలో దుర్గమాంబ

అగనంపూడి, జూలై 26: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరిసరగ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 26: స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని ఉక్కు ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో నగరం నుంచి నేరుగా బస్సులుండేవని, ప్రస్తుతం ఈ సర్వీసులు రద్దు చేయడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థితిలో అన్ని వర్గాల వారికి ఇబ్బందులు లేకుండా బస్సులు పునరుద్ధరిస్తే ఆర్టీసీకి ఆదాయంతో పాటు, జనాలకు ఇబ్బందులు తొలగుతాయని అంటున్నారు.

క్రాంతినగర్‌లో కార్పొరేటర్ పర్యటన

సింధియా, జూలై 26: గ్రేటర్ విశాఖ 63వ వార్డు క్రాంతినగర్‌లో కార్పొరేటర్ గల్లా చిన్న శుక్రవారం పర్యటించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాంతంలో జరిగిన నష్టంపై ఆయన ఆరా తీశారు. స్థానికులను సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొండ కృష్ణ, శ్యామ్‌సుందర్, జనసేన నాయకులు , జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

జోరుగా జనసేన సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం, జూలై 26: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలో శుక్రవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి కాద శ్రీను ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకే కార్యక్రమమని తెలిపారు. మహిళలు, యువత స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. శ్రీను, విశ్వేశ్వరరావు,రాజు, శివ గణేష్, రాము, సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థనగర్ వాటర్‌ప్లాంట్ పరిశీలన

కూర్మన్నపాలెం, జూలై 26: ఆటోనగర్ పరిశ్రమల నుంచి పారిశ్రామిక వ్యర్థాలు వాటర్ ప్లాంట్ గోడ వైపు రావటంతో తాగునీరు కలుషితవుతోంది. ఈ నేపథ్యంలో స్థానికుల వినతి మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ శుక్రవారం సిద్ధార్థనగర్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. తాగునీటి విభాగ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని జగన్ కోరారు. ఆయన వెంట రాజన్‌రాజు, వర్రె రాంబాబు, బలిరెడ్డి నాగేశ్వరరావు, డీవీ అప్పారావు, సత్తిబాబు తదితరులున్నారు.

రిలే దీక్షకు భెల్ నేతల సంఘీభావం


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జీటీపీ ప్రకాశ్

అక్కిరెడ్డిపాలెం, జూలై 26: పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీ హార్సు జంక్షన్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో బీహెచ్‌ఈఎల్ సీఐటీయూ నాయకులు శుక్రవారం పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీహెచ్‌ఈఎల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ మాట్లాడుతూ పోర్టులను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చెంనాయుడు, నారపురెడ్డి, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 34, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 28, దొండకాయలు 28, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 72, అల్లం 150, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 42, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

ఎటు చూసినా అంధకారమే

- వీధి దీపాల నిర్వహణను గాలికొదిలేసిన యంత్రాంగం
- చీకట్లో యాదవ జగ్గరాజుపేట, గ్రీన్‌సిటీ కాలనీ రహదారులు


అంధకారంలో యాదవజగ్గరాజుపేట రోడ్డు


చీకటిమయమైన గ్రీన్‌సిటీ కాలనీ రహదారి

ఆటోనగర్, జూలై 26: జీవీఎంసీ 88వ వార్డు యాదవజగ్గరాజుపేట నుంచి గ్రీన్‌సిటీ వైపు వెళ్లే రహదారుల్లో అంధకారం అలముకుంటోంది. ఈ మార్గంలో వందల సంఖ్యలో వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. నిర్వహణను పట్టించుకోకపోవడం, కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చకపోవడంతో కాలనీలు గాఢాంధకారంలో మగ్గుతున్నాయి. అర్ధరాత్రి విధులు పూర్తి చేసుకుని ఇళ్లకు వస్తున్న కార్మికులు వీధికుక్కల బారిన పడుతున్నారు. చీకట్లో రహదారులపై ఉన్న గోతులను గుర్తించలేక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విషసర్పాలు అధికంగా సంచరిస్తున్న ప్రాంతం కావడంతో రాత్రి సమయంలో బయటకు వచ్చేందుకు స్థానికులు భీతిల్లుతున్నారు. ఇదే అదనపుగా చిల్లర దొంగలు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నారనే ఫిర్యాదులు అధికమవుతున్నాయి.

ఆటోనగర్ పరిధిలో...

జీవీఎంసీ 71వ వార్డు ఆటోనగర్, చట్టివానిపాలెం, తోకాడలో పలు కాలనీలలో చీకటి పడితే స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఓ వైపు రహదారుల్లో గుంతలు. మరో వైపు అంధకారంతో ప్రయాణాలు సాగించలేని పరిస్థితి. దీనికితోడు కుక్కలు, పందులు స్వైరవిహారంతో భీతిల్లుపోతున్నారు. పారిశ్రామికవేత్తలు, ఏపీఐఐసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదని వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి'


రిలే నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, జూలై 26: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల తక్షణ పరిష్కారానికి సంస్థను సెయిల్‌లో విలీనం చేయడమే మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం పాల్గొన్న ఐఎన్‌టీయూసీ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించమని ప్రకటన చేయక పోవటం దారుణమన్నారు. సాధారణ ఉత్పత్తికి రామెటీరియల్ కొరత ఉందన్నారు. హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోరాటాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. పోరాట కమిటీ మరో చైర్మన్ డి.ఆదినారాయణ మట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఉక్కును ఆదుకునేందుకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. స్టీలు ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధ్యమన్నారు. ఏడు నెలలుగా సకాలంలో జీతాలివ్వలేని స్థితికి ప్లాంట్ చేరుకోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం గోపి, కారు రమణ, అవతారం, రాజు, సుబ్బయ్య, త్రిమూర్తులు, జగదీష్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గోతులమయమైన రహదారులు


గోతులతో నిండిన అశోక్‌నగర్, కొత్త దిబ్బపాలెం రహదారులు

పెదగంట్యాడ, జూలై 26: వారం రోజులుగా కురిసిన భారీవర్షాల కారణంగా పెదగంట్యాడ మండలంలోని రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షంనీరు రోడ్డుమీద నిలిచి ఉండడం, వాటిమీదుగా వాహనాలు రాకపోకలు సాగించడంతో గోతులు పడ్డాయి. కొన్నిచోట్ల తారురోడ్డుపై లేయర్ లేచిపోయింది. రాళ్లు తేలిపోయాయి. శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ 65వ వార్డు అశోక్‌నగర్, ప్రియదర్శనీకాలనీ, 64వ వార్డు కొత్తదిబ్బపాలెం, 75వ వార్డు నీలాపుదొడ్డ, 76వ వార్డు పెదనడుపూరు కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. గోతుల్లో వర్షం నీరు చేరడం, వాటి మీదుగా భారీ వాహనాలు రాక పోకలు సాగించగా గోతుల అంచులు కొట్టుకుపోయి పెద్దవిగా మారుతున్నాయి. దీంతో రాత్రివేళలో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి, మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


అమరవీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అగనంపూడి, జూలై 26: కొండయ్యవలస సీసీడబ్ల్యూసీ ప్రాంగణంలో ఆశా షైనీ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్గిల్ యుద్ధంలో దేశ సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించారన్నారు. నేటికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న మాజీ సైనికులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశాలత, గుదే సుశీలగజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, పైడిరత్నం, కరణం పైడిరాజు, బాలకృష్ణ, శాంతిప్రియ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జవాన్లకు సత్కారం

ఆటోనగర్: జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాస నగర్ శ్రీసాయి విద్యానికేతన్‌లో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ జవానులు ఎన్.శ్రీనివాసరావు, ఎస్.సురేష్ కుమార్లను ప్రిన్సిపాల్ నాగుల రవికుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా జవానులు మాట్లాడుతూ కార్గిల్‌లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన దేశ సైనికుల జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకానినగర్‌లో నివాళి

ఎన్.ఎ.డి.జంక్షన్: కార్గిల్ యుద్ధవీరులకు వినోద్‌నగర్, విమాన్‌నగర్, కనకమహాలక్ష్మీనగర్, కాకానినగర్ (వి.వి.కె.కె.) రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు శుక్రవారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ, పాకిస్థాన్‌పై యుద్ధంలో భారత్ అద్భుత విజయం సాధించి 25 ఏళ్లు గడుస్తుందని వివరించారు. మేజర్ పి.వి.రావు, అసోసియేషన్ కార్యదర్శి యుగంటేశ్వరరావు, కోశాధికారి మురళీధర్, రాము, శేఖర్ శ్యామ్, సురేష్‌కుమార్, వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుపాల్గొన్నారు.

సుజాతనగర్‌లో...

పెందుర్తి రూరల్: సుజాతనగర్ రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. వక్తలు కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన సాహసాలు, విజయానికి దోహదపడిన అంశాలను వివరించారు. కార్గిల్ విజయంపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, జి.ఎం.కె. రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



కాకానినగర్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, సత్కారం పొందిన మాజీ సైనికులతో సీఐ ఎర్రంనాయుడు, తదితరులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

కూర్మన్నపాలెం, జూలై 26: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని తిరుమల నగర్ కాలనీ అధ్యక్షుడు నాగభూషణం అన్నారు. తిరుమలనగర్‌లో శుక్రవారం ఏకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా పార్కుల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. ఇంటికి ఒక మొక్క చొప్పున పంపిణీ చేయడంతోపాటు కంపోస్టు ఎరువును కూడా పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కండి

సింధియా: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వాములై ఈ ఏడాది విశాఖ మొదటి ర్యాంక్ సాధించేలా కృషి చేయాలని జీవీఎంసీ బయాలజిస్టు సాంబమూర్తి, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏకేసీ కాలనీలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సురక్షిత నీటిని మాత్రమే తాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలుపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సింధియా: గ్రేటర్ విశాఖ 62వ వార్డు దుర్గానగర్ జీవీఎంసీ పాఠశాలలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని మలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణికుమారి, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రతిజ్ఞ

పెందుర్తి: గుర్రమ్మపాలెంలో శుక్రవారం పారిశుధ్యంపై అవగాహన సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఆర్‌ఏ పీడీ శోభారాణి హాజరై దోమకాటుతో డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలనున్నాయన్నారు. వీటి నివారణకు ప్రతి శుక్రవారం పంచాయతీలో డ్రైడేగా నిర్వహించాలన్నారు. స్థానికులు, డ్వాక్రా గ్రూపు సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ ఉగ్గిన దేవుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీడీపీవో నీలవేణి, వెలుగు ఏపీవో వెంకటరమణ కార్యదర్శి ప్రభు పాల్గొన్నారు.

జ్వరాలపై జాగ్రత్తలు పాటించాలి

అగనంపూడి: జ్వరాలు విజృంభించకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని 79వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సూచించారు. అగనంపూడి పరిసర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం మలేరియా విభాగం సిబ్బందితో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా జీవీఎంసీ సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సూపర్‌వైజర్ దిలీప్, సచివాలయం కార్యదర్శి కనకేశ్వరరావు, మలేరియా సిబ్బంది పీవీఎస్ మూర్తి, శివ, శ్యామలాదేవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024లో భాగంగా 92వ వార్డులో ప్రజారోగ్య విభాగం సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాలు, దుకాణాలకు వెళ్లి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ నగరాల్లో విశాఖ అగ్రగామిగా నిలవాటంటే నగర ప్రజల సహకారం అవసరమన్నారు. దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త తరలించే వాహనాలకు అందించాలని దుకాణదారులకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, సచివాలయ కార్యదర్శులు మణికుమార్, శోభారాణి, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


ఏకేసీ కాలనీలో మాట్లాడుతున్న సాంబమూర్తి


92వ వార్డులో ర్యాలీ చేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది


గుర్రమ్మపాలెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

ఉపాధి పనులపై ప్రజా వేదికలో సమీక్ష


ప్రజా వేదికలో క్షేత్రసహాయకుడిని విచారిస్తున్న అధికారులు

పెందుర్తి, జూలై 26: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై ఎంపీపీ మదుపాడ నాగమణి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. అడిషనల్ పీడీ రోజారాణి హాజరైయ్యారు. మండలంలోని 15 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సమీక్ష చేశారు. 886 ఉపాధి పనుల ద్వారా రూ. 5. 56 లక్షల వేతనాలు కూలీలు పొందినట్టు గణాంకాలతో వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా చేపట్టిన సోషల్ ఆడిట్ నివేదికను డీఆర్పీలు వివరించారు. ఈ క్రమంలో సరిపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ అవతవకలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. కొంతమంది ఉపాధి కూలీల వద్ద పనికేటాయించాలంటే రూ. 100 ఇవ్వాలని డిమాండ్ చేశారని ఫిర్యాదులు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో వేతనదారులను ఆధారాలు చూపాలని అధికారులు సూచించారు. ఉపాధి పనులకు హాజరుకానివారికి కొంతమందికి వేతనాలు అందజేసినట్టు ఆరోపణలపై ఫీల్డ్ అసిస్టెంట్ సంజాయిషీని కోరారు. మేట్లతో ఇబ్బంది తలెత్తిందని ఆయన వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై సమగ్ర విచారణ జరపాలని అడిషనల్ పీడీ ఆదేశించారు. ఈ అంశంపై వివాదం తలెత్తే వీలుండడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి సీహెచ్ నిర్మలాదేవి, ఏపీడీ ఆంజినేయులు, ఎంపీడీవో రవికుమార్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు

న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

పెదగంట్యాడ, జూలై 26: నగరపోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి స్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది తీరును ఆరా తీశారు. సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం శుభ్రం చేయించి మొక్కలు నాటాలని ఆదేశించారు. సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలని, అన్ని రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా 79950 95799 నంబరుకు తెలియజేయాలన్నారు. సీజ్ చేసినవాహనాలు పాడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శివారు, నిర్మానుష్య ప్రాంతాల్లో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతపరచాలని సూచించారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ కదలికను పసిగట్టాలని, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

'మళ్ల'తో పారిశ్రామిక ప్రాంత కార్పొరేటర్ల భేటీ!

మల్కాపురం, జూలై 26: పశ్చిమ నియోజకవర్గంలోని 40, 58 నుంచి 62 వార్డుల కార్పొరేటర్లు పార్టీ మారే అంశంపై మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌తో శుక్రవారం రహస్యంగా సమావేశమయ్యారు. ఇప్పటికే ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లలో ముగ్గురిని టీడీపీలోకి తీసుకోవడానికి ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. ఈ విషయంలో ఎవరూ తొందరపడవద్దని, రెండురోజులలో ఏ పార్టీలో చేరాలనే విషయం తెలుతుందని, అప్పటివరకు ఓపిగ్గా ఉండాలని మళ్ల సూచించినట్టు తెలిసింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడుతో త్వరలో కార్పొరేటర్లు సమావేశమయ్యే ఆలోచన ఉన్నట్టు సమాచారం.

పెందుర్తిలో ఘనంగా శిక్షా సప్తాహ్


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో చంద్రకళ

పెందుర్తి, జూలై 26: స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డిజిటిల్ విద్య, చిత్రలేఖనం పోటీలు, సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో చంద్రకళ హాజరై విద్యార్థులు గుణాత్మక అభ్యాసన విద్యపై సమీక్షించారు. అనంతరం డీఈవో పాఠశాలలోని టీటూల్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచన చేశారు. సాంస్కృతి ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం చిన్నమ్మాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు


తహసీల్దార్ విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ఎన్.ఎ.డీ.జంక్షన్ జూలై 26: ఎన్నికల విధుల్లో భాగంగా గోపాలపట్నం తహసీల్దార్‌గా వచ్చి తిరిగి సొంత జిల్లాకు పి.విజయభాస్కర్‌కు శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. గోపాలపట్నంలో దాదాపు ఆరునెలల పాటు విధులు నిర్వహించి వెనుదిరిగిన ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయాల వీఆర్‌ఓలు, సర్వేయర్లు అయనకు పుష్పగుచ్ఛం, స్వీట్లు అందజేసి సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, సర్వేయర్ జగదీశ్వరరావు, ఎలక్షన్ డ్యూటీ శ్రీనివాస్, ఆర్‌ఐ సురేష్‌కుమార్, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం, టైపిస్ట్ వంశీ, సహాయకులు రోహిత్‌కుమార్, నవీన్ సాహితీ, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



పెందుర్తి, జూలై 26: మండలంలోని ఎస్‌ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలో ఆషాడ మాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకంబరీ అవతారంలో అలంకరించారు. ఆలయ ధర్మకర్త కాగితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

పెదగంట్యాడ: కండిపిల్లిగ్రామంలో శ్రీవిజయదుర్గాదేవి శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించింది. ధర్మకర్తలు తెప్పల దుర్యోధన, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్చకులు రమేష్‌శర్మ, ఈశ్వర్‌శర్మ పూజలు చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి మహిళలు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే రూ. వెయ్యి జరిమానా: డీటీసీ



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

మురళీనగర్, జూలై 26 ; ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకుంటే రూ. 1000 జరిమానా విధించనున్నట్టు విశాఖ ఆర్టీఏ కార్యాలయ డీటీసీ జి.సి.రాజారత్నం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన రహదారి భద్రతా సమావేశంలో సవరించిన కొత్త నిబంధనలు తెలియజేశారు. బీఐఎస్ నంబర్ కలిగిన హెల్మెట్‌ను ధరించి తీరాలని అన్నారు. 2020 నుంచి ఈ మేరకు భద్రతా కేంద్రం ద్వారా 94,327 మందికి అవగాహన కల్పించినట్టు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ ధరించకుంటే జరిమానాతో పాటు 3 నెలల పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

'ఎంఈఎస్ బిల్డర్స్ సమస్యలు పరిష్కరించాలి'



నేవీ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రమిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

మల్కాపురం, జూలై 26: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచి ప్రతినిధుల ఆధ్వర్యంలో నేవీ ప్రధాన ఇంజనీర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీరెడ్డి, టీవీఎస్ సుబ్బరాజు (చిరంజీవి) మాట్లాడుతూ ఎంఈఎస్‌లో వివిధ తరగతుల్లో రిజిస్టర్ అయిన కాం ట్రాక్టర్ల టెండర్ పరిమితి పెంచాలని కోరారు. వర్కింగ్ గ్రూప్ సిఫార్సు ప్రకారం చేపట్టిన పనులు ఆధారంగా భద్రత కల్పించేలా జీఈ జారీ చేసి 50శాతం నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ క్లాస్ కాంట్రాక్టర్లకు రూ. 25 లక్షల పైగా రూ.50 లక్షల వరకు టెండర్లను జారీ చేయాలని, అలాగే, 11 నెలలకు టెండర్ల సమయంలో లేబర్ చార్జీలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉండేలా చూడాలని కోరారు. ఈ మేరకు నేవీ ప్రధాన ఇంజనీరును కలిసి వినతి పత్రమిచ్చారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి. సూరిబాబు, ఎన్. రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ ఎ.అనంతరాజు, కోశాధికారి రామప్రసాద్ రెడ్డి, సభ్యులు సి. బాలసతీష్, యు.వి. రామకృష్ణరాజు, సీహెచ్ సుదర్శన్, సీహెచ్ మంగపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



రామాటాకీస్ డౌన్ రోడ్డులో వ్యాపారులను తొలగిస్తున్న పోలీసులు

సీతంపేట, జూలై 26: రామాటాకీస్ డౌన్ రోడ్డులో రహదారులను ఆక్రమించి చేపడుతున్న చిరువ్యాపారాలను ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరావు పర్యవేక్షణలో తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అటుగా లేకుండా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రదానం రేపు

అక్కయ్యపాలెం, జూలై 26 : కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి విశ్వనాథ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28వ తేదీన ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ బహుమతుల ప్రదానోత్సవానికి పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆదారి శ్యాంప్రసాద్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు, ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ మళ్ళ భాస్కర్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి లచ్చా అప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి కుమార స్వామి, వేగి సత్యనారాయణ, బొడ్డేడ అప్పారావు, పెంటకోట సంజీవరావు, కోశాధికారి కొణతాల వరాహ కోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ అభివృద్ధికి చర్యలు

పూర్ణామార్కెట్, జూలై 26: పూర్ణామార్కెట్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలనే ఆలోచనలో జీవీఎంసీ జోనల్ అధికారులు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జీవీఎంసీ జాబితాలో ఉన్న దుకాణాల కంటే అధిక సంఖ్యలో మార్కెట్ లోపల వ్యాపారులున్నట్టు అధికారులు భావిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ అమలుతో ఈ అడ్డగోలు వ్యాపారాలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. వైసీపీ అనుకూలురు ఆశీల వసూల కోసం అడ్డగోలుగా వ్యాపారాలు ఇబ్బడిముబ్బడిగా అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పూర్ణామార్కెట్‌లో పార్కింగ్ స్థలం ఆక్రమణలు, మాస్టర్ ప్లాన్ అమలుకు పరిస్థితిని అంచనా వేసేందుకు జోనల్ కమిషనర్ ప్రసాద్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం తనిఖీ చేపట్టింది.



గతుకుల మయంగా సెబాస్టియన్ కాలనీ రోడ్డు



అధ్వానంగా బాబుకాలనీకి వెళ్లే మార్గం

అధ్వాన రహదారులతో అవస్థలు

» జ్ఞానాపురంలోని పలు కాలనీల్లో దుస్థితి

జ్ఞానాపురం, జూలై 26: జీవీఎంసీ 41వార్డు పరిధిలోని జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. కాలనీలో ఏ రోడ్డు చూసినా గతుకులతో నిండి ఉంటోంది. కొన్నిచోట్ల రోడ్ల తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతోపాటు ప్రస్తుతం వర్షాలుపడుతుండంతో బురదమయంగా మారుతున్నాయి. 24 గంటల నీటి సరఫరాకు తవ్విన రోడ్లు పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. ఆయా రోడ్లపై అనేకమంది వాహనదారులు ప్రమాదాలు బారిన పడి గాయాలపాలవుతున్నారు. అలాగే, ఈ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో అంధకారం నెలకొంది.ఈస్థితిలో జోన్-5 ఇంజనీరింగ్ అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మునిసిపల్ పీడీ, పీఈటీల అసోసియేషన్ అధ్యక్షుడిగా సునంద్



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 26 : ఏపీ మున్సిపల్ పీడీ, పీఈటీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎ. సునంద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను శుక్రవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎల్.రమణ, కోశాధికారిగా యూఎస్ రత్నం ఎన్నికయ్యారు. కేఎస్‌వీ సత్యనారాయణ (పైసా మాస్టారు) పర్యవేక్షణలో, రాష్ట్ర నాయకులు దాసరి సుధీర్, దోనేపూడి సురేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సత్కరించి అభినందించింది. జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సునంద్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీ ఎంసీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

టీడీపీ ఆత్మీయ సమావేశం



హనోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 26: గ్రేటర్ 45వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కంపా హనోక్ టీడీపీలో చేరిన సందర్భంగా మాజీ కార్పొరేటర్, టీడీపీ సీనియర్ నాయకుడు పైలా ముత్యాలనాయుడు, వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నరసింహనగర్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనోక్‌కు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం హనోక్ మాట్లాడుతూ,వార్డు అభివృద్ధికికృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి భాగస్వామినవుతానని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పలిశెట్టి అప్పన్న, కోట నరేష్, ఎస్కే బాబ్జీ, శెట్టి మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేటర్లతో టీడీపీ ఎమ్మెల్యేలు సమావేశం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు శనివారం పార్టీకి చెందిన కార్పొరేటర్లతో సమావేశం కానున్నారు. ఉదయం 10.30 గంటలకు దసపల్లా హోటల్‌లో ఈ సమావేశంలో టీడీపీ నుంచి గెలిచిన వారితోపాటు కొద్దిరోజుల కిందట వైసీపీ నుంచి పార్టీలో చేరిన కార్పొరేటర్లు కూడా ఈ పాల్గొననున్నారు. త్వరలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో ఆయా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహంతో పాటు ఇతర అంశాలపైనా చర్చించనున్నారు. అలాగే, స్థానిక ఇబ్బందులతో కొంత మంది వైసీపీకి చెందిన కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోలేదు. దీనిపైనా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముందని చెబుతున్నారు.

ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గం

అక్కయ్యపాలెం, జూలై 26: ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ వి శాఖ అర్బన్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ముందుగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్నికల అధికారి) గంట్ల శ్రీను బాబు నామినేషన్లు స్వీకరించారు. వాటిని పరిశీలించిన తర్వాత నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఇరోతి ఈశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పి.నరసింగరావు, కార్యదర్శిగా కె. మధన్, ఉపాధ్యక్షులుగా అనురాధ, నాయుడు, బాబూరావు ఎంపికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.భాస్కర్, మళ్ళ దేవత్రినాధ్, నాయుడు, కోశాధికారిగా ఎ.సు రేష్, జాయింట్ సెక్రటరీలుగాఎ.శేషు, కోరాడ శశిభూషణరావు తదితరులు ఎంపిక చేశారు.

సెల్‌ఫోన్ టెక్నీషియన్స్‌ను ప్రభుత్వాలు ఆదుకోవాలి

» వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

సీతంపేట, జూలై 26: విశాఖలోని సెల్‌ఫోన్ టెక్నీషియన్స్ అంతా ఏకతాటిపై నిలిచి సమస్యలు పరిష్కరించుకోవాలని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ సెల్‌ఫోన్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్స్ భవిష్యత్తు కార్యాచరణ, ఎదుర్కొంటున్న సమస్యలపై సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ సెల్‌ఫోను టెక్నీషియన్స్‌ని కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యవజన పథకం ద్వారా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా తమకు ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటి వరకు విశాఖలో 250 మంది సభ్యత్వం ఉందన్నారు. వీరికి సొసైటీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, రాము, రాజేష్, అహ్మద్, రాజేష్, ఇమ్రాన్, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 128 మంది ఎంపిక



అభ్యర్థికి నియామకపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కంచరపాలెం, జూలై 26: కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాంతాల నుంచి 385 మంది హాజరుకాగా, వీరిలో 128 మందిని ప్రాథమికంగా ఎంపికచేశారు. వీరికి ఉపాధికల్పనాధికారులు సీఈహెచ్. సుబ్బిరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ప్రాంతీయ ఉపాధికల్పనాధికారి సంగీత యువతకు పలు సూచనలు చేశారు.

నేటి నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

కంచరపాలెం,జూలై 26 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను శనివారం నుంచి నిర్వహించనునట్టు జిల్లా ఐటీఐల కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న స్టీల్‌ప్లాంట్ భూ బాధితులు, బాలికలు, మాజీ సైనికుల పిల్లలు, ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్స్ చెందిన విద్యార్థులు, దివ్యాంగులు తదితర కేటగిరీలకు చెందిన వారు (మొదటి ర్యాంకు నుంచి 875 ర్యాంకు వరకు), జీపీఏ 10 నుంచి 6.4 అభ్యర్థులు శనివారం ఉదయం 8 గంటలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఆదివారం 876 ర్యాంకు నుంచి 2067 ర్యాంకు వరకు (జీపీఏ 6.3, అంతకంటే తక్కువ) వారికి కౌన్సెలింగ్ ఉంటుంది. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్, కుల తదితర ధ్రువ త్రాలు తప్పకుండా తమ వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వ్యాను బోల్తా.. ఒకరి మృతి

దత్తిరాజేరు, జూలై 26: విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలోని మరడాం, కోమటిపల్లి మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం బొలేరో వ్యాను బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటనపై స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామభద్రపురం నుంచి విశాఖ వెళ్తున్న బొలేరో వ్యాను మరడాం, కోమటిపల్లి మధ్యలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విశాఖపట్టణం జిల్లా మారికవలసకు చెందిన లోగడ పైడినాయుడు(35), శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని పీహెచ్‌సీకి తరలించగా.. పైడినాయుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు.

ఒలింపిక్స్‌లో తెలుగు తేజం

... 5వ పేజీ తరువాయి

తర్వాత జ్యోతి పరుగు ప్రస్థానంలో చోటుచేసుకున్న మార్పులు ఆమె దశ, దిశను నిర్దేశించాయి. అనతికాలంలోనే 100 మీ. హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగి పతకమే లక్ష్యంగా ఆమె తీసిన పరుగుకు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. అంతర్జాతీయ ట్రాక్‌అండ్‌ఫీల్డ్‌లో ఆసియా క్రీడల వరకు ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించి అత్యున్నత అథ్లెట్లలో ఒకరిగా ఎదిగి ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరింది.

ఆగస్టు 7న రౌండ్-1 పోటీల్లో

ఆగస్టు 7న మహిళల 100 మీ. హర్డిల్స్‌లో రౌండ్-1 (హీట్స్) పోటీల్లో జ్యోతి పాల్గొననుంది. ఆగస్టు 8న జరిగే రిపిచేజ్ రేస్ (హీట్స్‌లో క్వాలిఫై కానివారిలో బెస్ట్ టైమింగ్ ఉన్న అథ్లెట్లకు మరో అవకాశంగా నిర్వహించేది) ఉంటుంది. ఆగస్టు 9న సెమీఫైనల్, 10న ఫైనల్ రేస్ జరగనుంది.

కమిషనరేట్ ప్రక్షాళన?

... 5వ పేజీ తరువాయి

రేంజ్‌కు సరండర్ కారణంగా ఖాళీ అయ్యే పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన ఇతర జిల్లాల్లోని ఎస్ఐ, సీఐల నుంచి సీపీ విజ్ఞాపనలు తీసుకుంటున్నారు. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న సీఐల్లో 28 మంది నగరానికి వచ్చేందుకు సంసిద్ధత తెలియజేస్తూ సీపీకి ప్రత్యక్షంగా, వాట్సాప్‌లోనూ దరఖాస్తులు అందజేసినట్టు సమాచారం. నగరానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నవారి సర్వీసు వివరాలతోపాటు గతంలో సస్పెన్షన్లు, చార్జిమెమోలు అందుకోవడం, వారి సమర్థతను తెలుసుకుని తనకు నివేదిక అందజేయాలంటూ సీపీ ఇప్పటికే కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. సమర్థులు, నిజాయితీగా పనిచేస్తారనే గుర్తింపు కలిగిన వారిని మాత్రమే నగరానికి తీసుకోవాలని సీపీ భావిస్తున్నట్టు సమాచారం. వీరితోపాటు నగరానికి రావడానికి ఆసక్తి చూపనివారిలో సమర్థులుగా గుర్తింపు కలిగిన వారితో సీపీ మరో జాబితా తయారుచేసుకున్నట్టు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. శాసనసభ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. కాబట్టి తర్వాత ఏ క్షణంలోనైనా అవినీతిపరులపై సీపీ చర్యలకు దిగే వీలుందని పోలీస్ కమిషనరేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పంచ గ్రామాల సమస్య పరిష్కారం దిశగా...

... 5వ పేజీ తరువాయి

లక్షలాది మందికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం నడుంబిగించింది.

పంచ గ్రామాల భూ సమస్యపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని సమావేశ మందిరంలో దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశం ఏర్పాటుచేసి, సమగ్రంగా చర్చించారు. ఆ వివరాలను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర హైకోర్టులో 2019లో దాఖలైన వ్యాజ్యానికి లోబడి జీవో 229లో పేర్కొన్న రేట్ల ప్రకారం 12,149 నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులపై నివేదిక సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమబద్ధీకరణ వల్ల సింహాచలం దేవస్థానానికి కలిగే నష్టాన్ని భర్తీ చేయనున్నారు. సుమారు 421 ఎకరాలకు సమాన విలువ ఉండే విధంగా ప్రాథమికంగా గుర్తించిన 853.6 ఎకరాల బదలాయింపుతో పాటు అవసరాల నిమిత్తం రహదారికి అనుసంధానంగా ఉన్న మరికొంత భూమిని గుర్తించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సత్వరం సమర్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్‌ను మంత్రి రామనారాయణరెడ్డి ఆదేశించారు. దాని ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతితో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి కోర్టు నుంచి ఉత్తర్వులు పొంది కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు చేపడతామని సమావేశంలో మంత్రి వెల్లడించారు. అదేవిధంగా పంచ గ్రామాల భూవివాదంలో అంతర్భాగమైన రైతుల సమస్యకు సంబంధించి 1,947 ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన అప్పీళ్ల విషయంలో కూడా పరిష్కారం కనుగొనేందుకు త్వరలో విశాఖ జిల్లా కలెక్టర్ సారథ్యంలో మరొక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పీవీజీఆర్ నాయుడు (గణబాబు), వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కోడూరి అచ్యుత రామచంద్రమోహన్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పని వేళల్లో మీటింగ్‌లు వద్దు

... 5వ పేజీ తరువాయి

తప్పించుకుంటున్నారని పేర్కొంది. వీరి వల్ల ప్లాంటులో ఉత్పత్తి తగ్గిపోతున్నదని ఆరోపించింది. ఎక్కడా లేనివి పాటిస్తూ ప్లాంటుకు నష్టం కలిగిస్తున్నారని, తక్షణమే వీటిని నిలుపుచేసి కార్మికులు, ఉద్యోగుల డ్యూటీ సమయంలో ప్లాంటు దాటి బయటకు వెళ్లకుండా, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని ఉక్కు మంత్రిత్వ శాఖ కోరింది. ఈ ఉత్తర్వులపై కార్మిక సంఘాల్లో తర్జనభర్జన మొదలైంది. అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో...అని అంతా ఎదురు చూస్తున్నారు. ఇటీవల పర్సనల్ డైరెక్టర్ తన పదవికి రాజీనామా చేయడానికి ఇవి కూడా కొంత కారణమని ప్లాంటు వర్గాలు చెబుతున్నాయి.

సమస్యలపై ఇప్పుడైనా దృష్టిసారించేనా?

... 5వ పేజీ తరువాయి

తరపున ఉన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో ఏ సమస్యనూ పట్టించుకోలేదు. ప్రధానంగా రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మరో మూడు నెలల పాటు వర్షాకాలం కొనసాగనున్నందున రోడ్ల మరమ్మతులకు తక్షణం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ జడ్పీ సమావేశం తీర్మానం చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్లుగా కాలువలు, జలాశయాలు, గ్రోయిన్ల మరమ్మతులు ఊసే లేదు. చివరకు డ్యామ్‌ల నిర్వహణకు నిధులు లేవు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పెద్దగా చొరవ చూపలేదు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు సజావుగా సాగాలంటే జలాశయాలకు సంబంధించిన కాల్వల్లో పూడికలు తీయడం, చిన్నపాటి మరమ్మతులు చేయడం పైనైనా దృష్టిసారించాలి. అలాగే వర్షాకాలం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలో మైదానం ప్రధానంగా ఏజెన్సీలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతంతోపాటు పట్టణాల్లో వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకోవాలి. కాగా 'నాడు-నేడు' పేరుతో రెండు దశల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం గడచిన ఏడాది నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అనేకచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటి పూర్తికి నిధులు తెచ్చుకోవలసి ఉంది. వర్షాలతో ఏజెన్సీలో పాఠశాలల భవనాలు దెబ్బతినడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టిన జల జీవన్ మిషన్ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగింది. వీటితో పాటు జిల్లాలో నెలకొని ఉన్న పలు సమస్యలపై జడ్పీ సమావేశంలో సభ్యులు చర్చించే అవకాశం ఉంది.

భూ రికార్డులకు భద్రత

... 5వ పేజీ తరువాయి

చేయాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు. అలాగే ప్రతి కార్యాలయంలో నైట్ వాచ్‌మన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వీఆర్‌ఏలకు డ్యూటీలు వేయాలని నిర్ణయించారు. ఏడెనిమిదేళ్ల క్రితంభీమిలి, విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రికార్డులు మార్చిన కొందరు అధికారులు, సిబ్బంది...ఆ విషయం ఎక్కడ బయటపడుతుందోనని నిప్పు పెట్టి, అగ్ని ప్రమాదం సంభవిం చిందని ప్రచారం చేసినట్టు అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం నగరంలో ఒక ప్రముఖుడి ప్రోద్బలంతో అర్బన్ ల్యాండ్ సీలింగ్ రికార్డులకు నిప్పు పెట్టేశారు. మదనపల్లె తరహా ఘటనలు గతంలో ఇక్కడ చోటుచేసుకున్న నేపథ్యంలో రికార్డులు సురక్షితంగా ఉండేందుకు కలెక్టరేట్‌తోపాటు, ఆర్డీవో కార్యాలయం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దారు కార్యాలయాల్లో కాంపాక్టర్లు (బీరువా మాదిరిగా) ఏర్పాటుకు నిర్ణయించారు.విశాఖ ఆర్డీవో కార్యాలయంలో భూమి రికార్డుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందని, తన పరిధిలో మండల తహసీల్దారు కార్యాలయాల్లో భద్రతా చర్యలుతీసుకోవాలని ఆదేశించామన్నారు.

టీడీఆర్‌ల జారీపై విచారణ

... 5వ పేజీ తరువాయి

జారీచేశారు. అలాగే బక్కన్నపాలెంలో పదిహేనేళ్ల కిందట నిర్మించిన రోడ్డులో రెండెకరాలు పోయిందంటూ ఒక వ్యక్తి దరఖాస్తు చేయగా...రూ.208 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేశారు. ఇవికాకుండా వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో నగరంలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలను వెలుగులోకి తేవాలని టీడీపీ ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రస్తావించగా మునిసిపల్ మంత్రి నారాయణ స్పందించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం రాత్రి పల్లా శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖలో టీడీఆర్ కుంభకోణం మొత్తం బయటకు తీస్తామన్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకునేలా విచారణకు ప్రభుత్వం ఆదేశాలు ఇస్తోందని ఆశాభావం వ్యక్తంచేశారు.

బయోలాజికల్ సైన్స్‌పై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

జ్ఞానాపురం, జూలై 26: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయోలాజికల్ సైన్స్‌లో పురోగతిపై జాతీయ సదస్సును శుక్రవారం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా మైసూర్ సీఎస్ఐఆర్ - సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హరీష్ ప్రశాంత్ హాజరయ్యారు. విద్యార్థులకు కెరీర్ ఇన్ సైంటిఫిక్ రీసెర్చ్, సవాళ్లు అనే అంశాలను వివరించారు. తొలి రోజు సదస్సులో ఏయూ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సుభాషిణిదేవి సిల్వర్ నానో పార్టికల్స్ క్షేత్ర పరిధి పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ పి.మేరీ అనుపమ, హోంసైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ ప్రభ, సుధ, పీకే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



రైల్వే న్యూ కాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, జూలై 26 : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కేఎస్ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మలేరియా, డెంగ్యూ వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దొర మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు సోకవన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, వాకర్స్ అసోసియేషన్ స భ్యులు హరినాథ్, సత్యనారాయణ, మలేరియా సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరుల త్యాగం మరువలేం



కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ సైనిక బ్యాంక్ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 26: పాకిస్థాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని, వారి త్యాగం మరువలేమని మాజీ సైనిక బ్యాంక్ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి సురేష్ అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమర వీరులకు నివాళులర్పిస్తూ మాజీ సైనిక ఉద్యోగులు బీచ్‌రోడ్డులో శుక్రవారం ఆల్ ఇండియా ఎక్స్ సర్వీస్ మేన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అమరవీరుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించారు. కాళీ మాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ఈ ర్యాలీ సాగింది. మాట్లాడుతూ 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా ఎనిమిదో వార్డు

- పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి సేవిస్తున్న యువత
- కొరవడిన పోలీసుల నిఘా



గంజాయి ఎక్కువగా సేవిస్తున్న యూపీహెచ్‌సీ సమీపంలోని పార్కు

ఎండాడ, జూలై 26 : జీవీఎంసీ 8వ వార్డులో గంజాయి సేవించే వారు అధికమవుతున్నారు. గంజాయ్ బ్యాచ్‌లకు ఈ వార్డు కేరాఫ్‌గా మారుతోంది. ఈ ప్రాంతంలోని యువకులు పూటుగా గంజాయి సేవించి విచక్షణ రహితంగా ఘర్షణలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఎండాడ, గొల్లల ఎండాడ ప్రాంతాల్లోని లేఅవుట్‌ల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉండడంతో పాటు కొన్ని స్థలాల్లో ఖాళీ షెడ్లు ఉన్నాయి. జన సంచారం లేకపోవడంతో గంజాయి సేవించే వారికి ఇవి ఆవాసాలుగా మారుతున్నాయి. సంబంధిత షెడ్ల యజమానులు లేకపోవడం, వాచ్‌మెన్‌లు కూడా ఉండకపోవడంతో గంజాయి వినియోగించే వారికి అవకాశంగా మారింది. ఎండాడ ఎయిమ్స్ కళాశాల వెనుక భాగం, ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డు నుంచి శ్రీరామ్ ప్రాపర్టీస్‌కి వెళ్లే ప్రాంతం, గొల్లల ఎండాడలోని వైఎల్‌పీ లేఅవుట్, గొల్లల ఎండాడకి ఆనుకుని ఉన్న డిఫెన్స్ ఫైరింగ్ స్టేషన్ ఏరియా, తిరుమల తిరుపతి దేవస్థానం వెనుక ఉన్న కొండ ప్రాంతం, ప్రభుత్వం ఇటీవల వేసిన లేఅవుట్ కొండ, ఐటీ రోడ్డు ప్రాంతాలు, ఎండాడ యూపీహెచ్‌సీ ప్రాంతం, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల వెనుక భాగం, వైట్స్ రెస్టో వెనుక భాగంలో గంజాయి ఎక్కువగా సేవిస్తున్నారు.

పులి సంచారం అంటూ పుకార్లు

ఇటీవల ఎండాడ యూపీహెచ్‌సీ ప్రాంతంలో పులి సంచారమంటూ పుకార్లు సృష్టించారు. అటవీ శాఖాధికారులు ఆ ప్రాంతంలో పర్యటించి, పరిశీలించిన అనంతరం పులి సంచారం బూటకమని తేల్చారు. ఇటువంటి పుకార్లు మద్యం సేవించేవారు, గంజాయి వినియోగించే వారి పనేనని గ్రామస్థులు అంటున్నారు. పులి సంచారమంటూ భయందోళన కలిగిస్తే అటుగా జన సంచారం ఉండదని వారి భావన. ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో స్థానిక యువతతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి ఇక్కడ గంజాయి సేవిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కొరవడిన పోలీసుల నిఘా..

ఎనిమిదో వార్డు సగం ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధి కాగా సగ భాగం పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో బీచ్ పెట్రోలింగ్ పేరుతో రెండు స్టేషన్ల పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ చేసేవారు. వైసీపీ ప్రభుత్వంలో బీచ్ పెట్రోలింగ్ వాహనాలను బీచ్ రోడ్డుకే పరిమితం చేశారు. ప్రస్తుతం (బ్లూ కాట్స్) ఇద్దరు,ముగ్గురు పోలీసులు ద్విచక్ర వాహనాల మీద తిరుగుతున్నా.. వారు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వార్డులో డ్రగ్స్ గంజాయి, బహిరంగంగా మద్యం సేవించే వారిని నియంత్రించాలంటే ప్రత్యేకంగా నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శాకంబరిగా విజయ దుర్గాదేవి

కొమ్మాది, జూలై 26 : సాయిరాం కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అలాగే చంద్రంపాలెం జాతర గుట్టపై వెలసిన దుర్గాలమ్మకు ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కొమ్మాది, జూలై 26 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత సూచించారు. శుక్రవారం ఆ వార్డులో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యమే అన్నింటికి కారణమవుతుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. జడ్సీ శైలజా వల్లి మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ కాలువలను శుభ్రం చేయాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ కిశోర్, శానటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు భీమిలి జోనల్ కార్యాలయం పునఃప్రారంభం



జీవీఎంసీ జోనల్ కార్యాలయం

భీమునిపట్నం, జూలై 25 : పట్టణంలోని జోనల్ -1 కార్యాలయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం పునఃప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి ముఖ్యఅతిథిగా హాజరవుతారని జడ్సీ కనకమహాలక్ష్మి చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ. జూలై 26 : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంతపాలెం, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్, ముస్తాఫా కాలనీ, కైలాసనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 38, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 34, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 28, దొండకాయలు 28, బంగాళా దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 150, బరబటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 42, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్రాయిలర్		
రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అలరించిన శ్రీకృష్ణ రాయబారం హరికథ

మద్దిలపాలెం, జూలై 26 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం శ్రీకృష్ణ రాయబారం హరి కథ అలరించింది. మొగిలిచర్ల నాగమణి భాగావతారిణి సంగీత కీర్తనలతో హరి కథ చెప్పి సభికులను ఆకట్టుకున్నారు. కౌరవ పాండవుల మధ్య యుద్ధం తలెత్తడం, యుద్ధం ఆపడానికి శ్రీకృష్ణుడు రాయబారం వరకు ఆసక్తిగా సాగింది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, మంతెన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీకి వినతులు



వీసీ శశిభూషణరావుకు అభినందనలు తెలియజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకోజీపాలెం, జూలై 26 : ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణ రావును పూర్వ విద్యార్థులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు గ్రంథాలయంలో ఉన్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో మాదిరి లైబ్రరీ సెలవు రోజుల్లో కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. మెయిన్ లైబ్రరీతో పాటు రీడింగ్ రూమ్ సమయాన్ని పెంచాలన్నారు. సెక్షన్ ఇన్‌చార్జిలు లేకపోవడంతో విద్యార్థులకు సరైన సమాచారం అందడం లేదని, ఫైన్ ఎక్కువగా వేస్తున్నారని, మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ మీనన్, నాని, డాక్టర్ పట్నాయక్, రాజు, రాజకుమార్, సతీష్‌కుమార్, పూర్ణారావు, శశిధర్, రాజశేఖర్, తిరుపతి, శ్రావణి, సునీత, కౌసల్య, దీపిక పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్



కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, జూలై 26 : దేశ ప్రజల రక్షణ, భద్రత కోసం వీరోచిత పోరాటాలు చేస్తూ, ప్రాణాలు సైతం అర్పిస్తున్న వీర సైనికుల త్యాగాలను యువతరం ఎప్పుడూ గుర్తుంచుకోవాలని ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని శుక్రవారం ఏయూ విద్యా విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు దేశం పట్ల ప్రేమను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఏయూ దూరవిద్య సంచాలకుడు విజయ్‌మోహన్, శ్యామలరావు, మహేందర్, యుగంధర్, పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభం

తగరపువలస, జూలై 26 : తగరపువలసలో హనుమాన్ జిమ్ పేరుతో ఏర్పాటు చేసిన వ్యాయామ శాలను టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ శుక్రవారం ప్రారంభించారు. తెలుగు యువత ఆధ్వర్యంలో ఈ జిమ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నూకరాజు, అప్పలనాయుడు నగేష్ కుమార్ పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'

భీమునిపట్నం, జూలై 26 : బాల్య వివాహాల నిర్మూలనలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమిలి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా కోరారు. శుక్రవారం ఎగువపేట అంగన్‌వాడీ మెర్జింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. ప్రతి మహిళ గృహ హింస, తదితర మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి. శాంతికుమారి, ఆర్. అచ్యుతాంబ, సత్య, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో సత్ఫలితాలు

తగరపువలస, జూలై 26 : పాఠశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీ ఉపయోగించి బోధన చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని, అందుకు అవసరమైన చర్యలను విద్యా శాఖ చేపడుతోందని సాంకేతిక విద్యా విభాగం తరళ్ జిల్లా సమన్వయకర్త కె. శంకరరావు అన్నారు.శుక్రవారం ఆయన బంగ్లామెట్ట పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలకు అందించిన ట్యాబ్‌లు, ఇతర డిజిటల్ డివైస్‌లు ఎన్ని వినియోగంలో ఉన్నాయి, ఎన్ని పాడైపోయాయన్న విషయాలను పరిశీలిస్తున్నామని, పాడైన వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులకు నెట్ కనెక్టింగ్, టైపింగ్, కంటెంటు చూడడం, ప్రొఫైల్ క్రమబద్ధీకరణ వంటి పనులు నేర్పించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే నెట్‌తో అనుసంధానమైన డిజిటల్ పానెళ్లను ఉన్నత పాఠశాలలకు సరఫరా చేశామని చెప్పారు.

'తెలుగు సాహిత్యం సామాజికత' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, తదితరులు

భీమునిపట్నం, జూలై 26 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ డి.ప్రవీణ సంకలనం చేసిన తెలుగు సాహిత్యం సామాజికత పుస్తకాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో రచించిన రచనల సమాహారమే తెలుగు సాహిత్యమన్నారు. డాక్టర్ ప్రవీణ విద్యార్థులకు, సమాజానికి ఉపయోగకరమైన పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలిసిన 8వ వార్డు నాయకులు



పల్లా శ్రీనివాసరావును సత్కరించిన నాయకులు

ఎండాడ, జూలై 26 : జీవీఎంసీ 8వ వార్డు టీడీపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వార్డులో పార్టీకి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, నాయకులు ప్రవీణ్, ఒమ్మి బాబూరావు, పత్తి ఉదయ్‌కుమార్, తిరువీధి శేఖర్, బెల్లాన శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



నీటి నిల్వలను తొలగిస్తున్న వైద్య సిబ్బంది



భీమిలిలో అవగాహన ర్యాలీ

పద్మనాభం, జూలై 26 : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని వెలుగు ఏపీఎం వి. ప్రభాకరరావు చెప్పారు. శుక్రవారం ఆయన ఏనుగులపాలెం గ్రామంలో గ్రామైక్య సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్వరాలు రావడానికి కారణమైన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత టైర్లు, ఫ్రిజ్ వెనుక ట్రే తదితర వాటిలో ఉండే నీరు తొలగిస్తే దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డు శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీరావు, టీడీపీ నాయకుడు గరికిన నూకరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

భీమునిపట్నం : జీవీఎంసీ మూడో వార్డు ఎగువపేటలో శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎగువపేట ముఖద్వారం వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జడ్సీ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు విజృంభించే అవకాశం ఉం దని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. అలాగే ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు, మలేరియా ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం



ఆరిలోవలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ, జూలై 26 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వామపక్షాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మధురవాడ మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధికి వివిధ ఆర్థిక సంస్థలు, ప్రపంచ బ్యాంకు ద్వారా రూ. 15 వేల కోట్లు ఇస్తామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారని, అలాంటపుడు కేంద్రం ఏమిచ్చినట్టు అని ప్రశ్నించారు. విశాఖకు రైల్వే జోన్‌తో పాటు మెట్రో ప్రాజెక్టుపై కూడా బీజేపీ నోరుమెదపలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. రాజుకుమార్, గోవిందా, రెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ ఆరిలోవలోని టీఐసీ పాయింట్ వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుమార్ మాట్లాడుతూ బీజేపీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఒక్క ప్రాజెక్టుపై కూడా స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయ కులు నరేంద్రకుమార్, ఎస్. రంగమ్మ, పి. శంకర్రావు, కె. సత్యన్నారాయణ, వి. కాంత, తులసీరామ్ పాల్గొన్నారు.



వర్షానికి చిత్తడిగా మారిన పద్మనాభం ప్రధాన రహదారి

వర్షాలతో చిత్తడిగా గ్రామీణ రోడ్లు

పద్మనాభం, జూలై 26 : మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. చిన్నాపురం జంక్షన్-పద్మనాభం-శొంఠ్యాం రోడ్డులో పద్మనాభం ప్రధాన రహదారి, తునివలస, విజయానందపురం, మద్ది ధర్మశాస్తా పీఠం వద్ద, శిర్లపాలెం చెరకు కాటా ప్రాంతంతో పాటు పద్మనాభం-మహరాజుపేట రోడ్డులో కుర్రపల్లి జగనన్న కాలనీ ప్రాంతంలోను, రేవిడి-అయినాడ రోడ్డులో అయినాడ, బీఆర్ తాళ్లవలస, వెంకటాపురం, కోరాడ తదితర చోట్ల రహదారులు శిథిలావస్థకు చేరుకొని గోతులు పడ్డాయి. వర్షం నీరు గోతుల్లో చేరడంతో వాహనదారులు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రెడ్డిపల్లి శాంతినికేతన్, పద్మనాభం సచివాలయం ప్రాంతం, మద్ది ఇసుక గెడ్డ ప్రాంతంలో రోడ్ల దుస్థితి మరీ దారుణంగా ఉంది.ఈరోడ్డు మరమ్మతుకు ఇటీవల వేసిన వెట్ మిక్సర్ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాళ్లు తేలిపోయాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బురదమయంగా మార్కెట్



మార్కెట్ ఎదుట పేరుకుపోయిన బురద

భీమునిపట్నం, జూలై 26 : పట్టణంలో గంటస్తంభం వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్కెట్ ప్రాంతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటికి తోడు సమీపంలో కాలువల నుంచి వస్తున్న దుర్వాసనతో నరకయాతన పడుతున్నారు.అలాగే కొన్నిచోట్ల నీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'కనీస సౌకర్యాలు కల్పించాలి'



బక్కన్నపాలెంలో ఆందోళన చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

కొమ్మాది, జూలై 26 : బక్కన్నపాలెం వద్ద హుద్‌హుద్ తుఫాన్ బాధితుల కోసం సినీ పరిశ్రమ నిర్మించిన ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్‌టీఆర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ ఇళ్ల వద్ద నివాసితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షాలకు మొక్కలు పెరిగిపోవడంతో దోమలు అధికంగా ఉన్నాయని, పాములు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొందన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె. చిన్న, రవి, గీత, కీర్తి పాల్గొన్నారు.

తగరపువలసలో బస్ షెల్టర్ ప్రారంభం

తగరపువలస, జూలై 26 : తగరపువలస జంక్షన్‌లో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్ ఎట్టకేలకు ప్రారంభమైంది. జంక్షన్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎండా, వానకు దుకాణాల వద్ద తలదాచుకునేవారు. ఈనేపథ్యంలో జాతీయ రహదారుల విస్తరణ శాఖ (ఎన్‌హెచ్ఏఐ) వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న మాదిరిగా ఇక్కడ కూడా బస్ షెల్టర్ నిర్మించింది. ఇందులో ప్రయాణికులు కూర్చోవడానికి సీటింగ్‌తో పాటు వృద్ధులు నిల్చునే సమయంలో పట్టుకోవడానికి స్టీలు రాడ్లు ఏర్పాటు చేశారు.

సింహాద్రినాథుడికి వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, జూలై 26 : సింహాద్రినాథుడికి శుక్రవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా జరిపారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన జరిపారు. తరువాత అదే వైదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలు సమర్పించిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి దరఖాస్తుల స్వీకరణ

పద్మనాభం (రూరల్), జూలై 26 : మండలంలోని రైతులు మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి మహేష్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు పాడి పశువులు ఉన్న రైతులకు రూ. 1.15 లక్షలు, నాలుగు పాడి పశువులు ఉన్న వారికి రూ. 1.85 లక్షలు, ఆరు పాడి పశువులు ఉన్న వారికి రూ. 2.30 లక్షలు యూనిట్ విలువ ఉంటుందన్నారు. అలాగే గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 20 జీవాలు ఉన్న వారికి రూ. 1.30 లక్షలు, 50 జీవాలు ఉంటే రూ. 2.30 లక్షలు మంజూరు చేస్తామని చెప్పారు. వీటికి 30 శాతం లబ్ధిదారుడి వాటా కింద చెల్లించాలని తెలిపారు. అలాగే కోళ్ల షెడ్ల నిర్మాణానికి వంద కోళ్లు ఉన్న వారికి రూ. 87 వేలు, 200 కోళ్లు ఉంటే రూ. 1.40 లక్షలు యూనిట్ విలువ ఉంటుందన్నారు. వీటికి కూడా ప్రభుత్వం 70 శాతం రాయితీ ఇవ్వగా 30 శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల వారు స్థానిక పశు వైద్యాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాజీ సైనికుల కొవ్వొత్తుల ర్యాలీ

తగరపువలస, జూలై 26 : జాతీయ సైనిక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మాజీ సైనికులు తగరపువలసలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన వారిని స్మరించుకుంటూ ఈ ప్రదర్శన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద వీర జవాన్లకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఎస్‌వోఎఫ్‌లో భీమిలి విద్యార్థి ప్రతిభ

భీమునిపట్నం, జూలై 26 : పట్టణంలోని ది సన్ స్కూల్ అనుబంధ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్ విద్యార్థి కొండపల్లి సూర్య రిత్విక్‌కు ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో రజిత పతకంతో పాటు నగదు బహుమతి లభించింది. 2023-24 విద్యా సంవత్సరంలో సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఎస్‌వోఎఫ్ ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జి పరీక్ష నిర్వహించింది. ఇందులో 5వ తరగతి విద్యార్థి రిత్విక్ అంతర్జాతీయంగా 14వ ర్యాంక్, జోనల్‌లో 3వ ర్యాంక్ పొందాడు.